ఆగదయా.. మైనింగ్ మాఫియా



అక్రమ క్వారీల దోపిడీ హద్దు దాటుతోంది. మైనింగ్ మాఫియా అనుమతుల పేరుతో అక్రమ క్వారీలను అమ్మేస్తోంది. లీజుకు పేరుతో లక్షలు దోచుకుంటోంది. కొండలను పిండి కాసులు కొల్లగొడుతోంది. అక్రమాలకు తమిళనాడు వ్యక్తులను అడ్డం పెడుతోంది. ఈ అక్రమాలకు అధికారికంగా అధికారులు దారి చూపిస్తున్నారు. తెరవెనుక ఈ దందాను కూటమి నేతలే నడిపిస్తున్నారు. దీంతో ఆశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు గుప్పుమంటోంది.

- యాదమరిలో రెచ్చిపోతున్న అక్రమ మైనింగ్
- అనుమతులు ఓ చోట.. తవ్వకాలు మరో చోట
- ఆపై అనధికార క్వారీల లీజు
- అక్రమ గ్రానైట్ దిమ్మెల తరలింపునకు అధికారికంగా అనుమతులు
- తమిళనాడు వ్యక్తులతో కలిసి నయా దందా
- తెర వెనుక కూటమి నేతలు
- చూసీచూడనట్లు వదిలేస్తున్న అధికారులు

యాదమరి : మండలంలోని దాసరపల్లి వద్ద పలు క్వారీలు ఉన్నాయి. గతంలో అక్కడ రెండు క్వారీలు జరిగేవి. అందులో ఓ క్వారీ అనివార్య కారణాల వల్ల నిలిచిపోయింది. మరో క్వారీకి లీజు కాలపరిమితి ముగిసింది. అయితే దాసరపల్లి ప్రాంతంలోనే ఐదు నెలలకు క్రితం ఓ అక్రమ క్వారీ గుట్టు చప్పుడు కాకుండా పురుడు పోసుకుంది. బెంగళూరులో స్థిరపడిన ఓ కూటమి నేత కన్నుసన్నల్లో ప్రస్తుతం ఈ క్వారీ నడుస్తోంది. ఇందులో బయటపడిన ఖనిజానికి ఎక్కడ లేని డిమాండ్ ఉంది. తమిళనాడు వ్యక్తులను అడ్డం పెట్టుకుని ఈ క్వారీని నడిపిస్తున్నారు. ఎవరైనా ఆ క్వారీ నిర్వాహణపై ప్రశ్నిస్తే.. అనుమతులు ఉన్నాయని, లీజుకు తీసుకున్నామని చెప్పి వారిని మభ్యపెడుతున్నారు. చివరకు ఈ క్వారీకి అనుమతులు లేవని తేలింది. గొల్లపల్లి ప్రాంతంలో అనుమతులు ఉన్న క్వారీ పేరు చెప్పి.. అక్రమ క్వారీని తవ్వేకొద్దీ తవ్వేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. గొల్లపల్లి ప్రాంతానికి దాసరిపల్లి ప్రాంతానికి 10 కి.మీ. దూరం ఉందని వారు అంటున్నారు. అనుమతులు ఉన్న క్వారీకి కచ్చితంగా గుర్తింపురాళ్లు ఉంటాయని, ఈ అక్రమ క్వారీకి అలాంటి గుర్తింపు రాళ్లు ఏమిలేవని వెల్లడిస్తున్నారు.

ఎలా ఇచ్చారు..?

ఐదు నెలలుగా ఈ అక్రమ క్వారీ నడుస్తున్నా.. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అధికారులకు తెలిసే ఈ క్వారీ నడుస్తోందనే తెలుస్తోంది. అక్రమ క్వారీలోని గ్రానైట్ దిమ్మెలకు అధికారికంగా అనుమతులు ఇచ్చారనే వాదన నడుస్తోంది. సుమారుగా 25 బ్లాక్‌లకు సీనరేజ్ వసూళ్లు చేసి అక్రమ గ్రానైట్‌కు రైట్‌రైట్ చెప్పారని.. అధికారులకు ఫిర్యాదు అందింది. ఇందుకు ఓ అధికారి పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నట్లు రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి గ్రామస్తులు, సంఘ సభ్యులు తీసుకెళ్లారు. అక్రమ క్వారీలో ఉండే దిమ్మెలకు అధికారులు ఏ రకంగా కొలుతలు వేసి తరలింపునకు అధికారికంగా అనుమతులు ఇచ్చారు. అక్రమ క్వారీలో ఉన్న బండలకు లీజుకున్న క్వారీ పేరును ఎలా ప్రస్తావిస్తారు ? అసలు ఆ అక్రమ క్వారీ నిర్వాహకులకు.. ఆ అధికారి ఉన్న సంబంధాలు ఏమి..? ఇలా ఎన్ని నెలలుగా నడుస్తోంది..? ఇంత జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోలేదు ? అక్రమ క్వారీ విషయంలో రెవెన్యూ అధికారులు ఎందుకు స్పందించ లేదని ఆ ఫిర్యాదులో ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఒక్కసారిగా అక్రమ క్వారీ నుంచి రూ.20 లక్షలు విలువ చేసే గ్రానైట్ దిమ్మెలు తరలుతున్నట్లు అందులో పేర్కొన్నారు. మైనింగ్ అధికారులు దీనిపై కూడా చూసీచూడనట్లు వదిలేస్తారా లేకుంటే చర్యలు తీసుకుంటారా అనేది ప్రశ్నర్థాకమే. ఇక అక్రమ క్వారీపై అధికారుల తీరును ఎండగడుతూ మండిపాటుకు గురవుతున్నారు. అక్రమ క్వారీకి..అనుమతి ఉన్న క్వారీ పేరు వాడడం ముమ్మాటికీ చట్ట విరుద్ధమని, అక్రమాలకు సహకరిస్తున్న శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం..

అక్రమ క్వారీపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. అక్రమ క్వారీలో దిమ్మెలకు ఎలా అనుమతులు ఇచ్చారో చూస్తాం విచారిస్తాం. మా చేతుల్లో ఏమీ ఉండదు. అంతా టెక్నికల్ టీమ్ వెళ్లి కొలతలు వేస్తారు. వారిచ్చే నివేదికల ఆధారంగా అప్రూవల్ ఇస్తాం. ఈ విషయంలో పాత్ర ఏమి ఉండదు.

– సత్యనారాయణ, డీడీ, మైనింగ్ శాఖ, చిత్తూరు

క్లుప్తంగా

వరద బాధితులకు అల్పాహారం పంపిణీ



అల్పాహారం పంపిణీ చేస్తున్న సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని వీరభద్ర కాలనీ వాసులకు శుక్రవారం జీసస్ బ్లెస్సింగ్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. వర్షాలకు వరద నీటి బారిన వీరభద్రకాలనీ పడింది. నీళ్లు కాస్తా ఇళ్లను తాకడంతో గడప దాటి రాలేని పరిస్థితి కలిగింది. ఈనేపథ్యంలో మినిస్ట్రీ సభ్యులు దాదాపు బాధితులు వందమందికి అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో జేబీఎం డైరెక్టర్ రెవరెండ్ వి.యోవాన్, ప్రెసిడెంట్ రెవరెండ్ వి.కిరణ్‌బాబు, రీజియన్ కో–ఆర్డినేటర్, ధనరాజు, దళిత నాయకుడు చిత్తూర్ క్రిస్టియన్ మైనారిటీ ప్రెసిడెంట్ రమేష్ ప్రసాద్, జాషువా, బంగారు పాళ్యం రవి, ఎమిమా, చందన పాల్గొన్నారు.

బాలల సంరక్షణపై అవగాహన



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్

గుడిపాల: బాలల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ శిరీష అన్నారు. శుక్రవారం నరహరిపేట జెడ్పీ హైస్కూల్‌లో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని అంగన్‌వాడీ ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ రజనీకాంత్ అధ్యక్షతన నిర్వహించారు. బాలికల రక్షణ, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడుల నిర్మూలన, కిడ్నాప్‌లు, లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. బాలల సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బాలలకు ఎలాంటి కష్టం వచ్చినా 1098కు కాల్ చేయాలన్నారు. అనంతరం పిల్లలకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దూర్వాసులు, ఎంఈఓ హసన్‌బాషా, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తోయాద్రాక్షి, మహిళా పోలీస్ పావని పాల్గొన్నారు.

జి.గొల్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్



జి.గొల్లపల్లెలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

తవణంపల్లె: ప్రతిఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం జి.గొల్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో శ్రీలేఖ



స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని శుక్రవారం రాత్రి సినీ సంగీత దర్శకురాలు ఎం.ఎం శ్రీలేఖ దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఈఓ పెంచల కిషోర్ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది చిట్టిబాబు, కోదండపాణి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

పలమనేరు: తక్కువ వేతనంతో ఎక్కువ పనులు చేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను తీర్చాలని, లేదంటే నవంబరు 7న సమ్మెను పెద్ద ఎత్తున చేపడతామని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు వాడ గంగరాజు హెచ్చరించారు. ఆయన శుక్రవారం కార్మికులతో కలిసి స్థానిక బాపూజీ పార్కులో నిరసన తెలిపి గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ తమ సమస్యను కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే నిరసనలకు పిలుపునిచ్చామన్నారు. రఘు, మంజునాథ్, రమేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులపై నిర్లక్ష్యం



గాంధీ విగ్రహం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

చిత్తూరు అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు తీర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం చిత్తూరులోని గాంధీ విగ్రహం వద్ద కార్మికులు ఆందోళన చేశారు. ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు నాగరాజన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజల ఆరోగ్యం కాపాడుతున్న మున్సిపల్ కార్మికుల అనారోగ్య సమస్యలను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదన్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రోత్సాహకాలు మంజూరు చేయాలని పలుమార్లు డిమాండ్ చేసినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఇంజినీరింగ్, ప్రజారోగ్యశాఖ, డ్రైవర్ల విభాగంలో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న కార్మికులు కనీస వేతనాలు అందక ఆకలితో అలమటిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని చెప్పారు. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చేనెల 3వ తేదీ నుంచి కార్మికులంతా నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు హెచ్చరించారు. ఉద్యోగ సంఘ నాయకులు వాసు, జయశంకర్, లోకనాథం, వినాయక, రఘు, విజయగౌరి, బాలాజీరావు, సుగుణ, ఈశ్వర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

గొప్పపాలకుడు శ్రీకృష్ణదేవరాయలు

చిత్తూరు కార్పొరేషన్ : విజయనగరాన్ని పరిపాలించిన చక్రవర్తుల్లో గొప్ప పాలకుడు శ్రీకృష్ణదేవరాయలు అని వైఎస్సార్‌సీపీ కాపు విభాగం నాయకులు అప్పాజీ, ఎంవీ రమణ అన్నారు. శుక్రవారం శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు తెలుగుభాషకు చేసిన సేవ అజరామరమని అన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధితోనే ఆర్థిక స్థితిగతులు మారతాయని భావించిన శ్రీకృష్ణదేవరాయలు అనేక చెరువులను తవ్వించారన్నారు. భాష, సాంస్కృతిక, సంప్రదాయాలకు ఆయన పెద్దపీట వేశారని తెలిపారు. ఆయన జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సభ్యులు ఎంవీ రెడ్డెప్ప, రవి, బాబుప్రసాద్, గౌతమ్, జయపాల్, ప్రశాంత్, సుబ్బ పాల్గొన్నారు.



శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతిలో వైఎస్సార్‌సీపీ కాపు విభాగం నేతలు

రక్తహీనత నివారణే లక్ష్యం

ఐరాల: విద్యార్థుల్లో రక్తహీనత నివారణే ఎనీమియా ముక్త్ భారత్ లక్ష్యమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని నాంపల్లె, వడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు చేతుల శుభ్రం, ఐరన్ మాత్రలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో రక్తహీనత సమస్య అధిగమించడానికి ఐరన్ పోలిక్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థినులకు వైద్య సిబ్బంది ఐరన్ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



విద్యార్థినులకు ఐరన్ మాత్రలు మింగిస్తున్న వైద్య సిబ్బంది

ఆడపిల్లలను ఆదరిద్దాం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో అధికారులు



హాజరైన విద్యార్థులు

ఐరాల: ఆడపిల్లలను సముచితంగా గౌరవించి ఆదరిద్దామని జిల్లా లీగల్ సెల్ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎం.పైపల్లె జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం భానుప్రకాష్ అధ్యక్షతన ఐసీడీఎస్ సీడీపీఓ నిర్మల అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వెంకటేశ్వర్లు, ఎంఈఓ రుషేంద్రబాబు, సీడీపీఓ మాట్లాడారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆడపిల్లలకు ఉన్న హక్కులపై వారికి అవగాహన కల్పించి సమాజంలో గౌరవం పొందేలా పెంచాలని తల్లిదండ్రులకు సూచించారు. బాలికలు అన్ని రంగాల్లో సత్తా చాటాలన్నారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మండలంలోని ఏడు హైస్కూళ్లు, రెండు కాలేజీల విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, మంజుల, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర హాస్టల్ తనిఖీ

ఐరాల: స్థానిక ఎస్సీ బాలుర ఎస్సీ హాస్టల్‌ను శుక్రవారం రాత్రి మండల స్పెషలాఫీసర్ బీసీ, డీడీ రబ్బానిబాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, రికార్డులను పరిశీలించారు. రోజూ మెనూ ప్రకారం అన్నీ పెడుతున్నారా? సదుపాయాలు ఎలా ఉన్నాయి? అంటూ డీడీ విద్యార్థులను ఆరా తీశారు. మరుగుదొడ్లు, వంట గది, కిచెన్, డైనింగ్ హాల్, కూరగాయలు, బియ్యం తదితర వంట సామాన్లను పరిశీలించారు. అనంతరం భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డెన్ సురేష్ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న బీసీ, డీడీ రబ్బానిబాషా

బాలికలు అన్నింటా రాణించాలి

తవణంపల్లె: బాలికలు విద్యతో పాటు అన్నింటా రాణించాలని ఎంఈఓ మోహన్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవ వారోత్సవాలను శుక్రవారం అరగొండ బాలికల హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఎంఈఓతోపాటు సీహెచ్ఓ జ్ఞానశేఖర్ మాట్లాడారు. బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్నమ్మ మాట్లాడుతూ, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం విద్యార్థినులకు వ్యాసరచన, చిత్రలేఖనం, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, గోపి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, ఆరోగ్య కార్యకర్త సుబ్రమణ్యం రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

కోరం లేక మండల సమావేశం వాయిదా

గుడిపాల: మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ముందుగానే అధికారులు ప్రకటించారు. మండలంలో ఉన్న12 మంది ఎంపీటీసీలలో వసంతాపురం, పాపసముద్రం ఎంపీటీసీలు విజయలక్ష్మి, బాలమ్మ మాత్రమే వచ్చారు. సమావేశం నిర్వహణకు కనీసం ఐదుగురు సభ్యులు హాజరు కావాల్సి ఉంది. కోరం లేకపోవడంతో సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ ప్రకటించారు. అలాగే 27 పంచాయతీలకు సంబంధించి సర్పంచులు కూడా రాలేదు. కేవలం నలుగురు సర్పంచులు మాత్రమే హాజరయ్యారు. అధికారులు కూడా అంతంత మాత్రమే హాజరయ్యారు.

క్రీడా వస్తువులపై జీఎస్టీ తగ్గింపు

యాదమరి: గ్రామీణ ప్రాంతాలలో క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడా వస్తువులపై జీఎస్టీని తగ్గించాయని నోడల్ అధికారి జితేంద్రబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జీఎస్టీపై అవగాహన కల్పించారు. గతంలో ఆట వస్తువులపై 12శాతం జీఎస్టీ ఉండేదని, ప్రస్తుతం 5 శాతానికి తగ్గించిందని అన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కనకాచారి, ఇన్‌చార్జి హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్‌లో సత్తా చాటిన విద్యార్థులు



జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులు

శ్రీరంగరాజపురం: మండలంలోని ఆరిమాకులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్‌గేమ్స్‌లో జిల్లా స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం ఎస్.కళావతి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగరిలోని పీసీఎన్ ప్రభుత్వ పాఠశాలలో డివిజన్ స్థాయి క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఆరిమాకులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సి.ప్రియా, కె.కీర్తన, కె.కావ్య వాలీబాల్ అండర్–14లో జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు లోకనాథం, ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు బాలాజీ, చంద్రశేఖర్, బాబు, పద్మశ్రీ, సరోజమ్మ, జానకి,సత్య, అరుణకుమారి, ప్రసన్నకుమారి, మహేష్ అభినందించారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన



బైక్‌లో వెళుతూ పరిశీలిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: చిత్తూరులో ఇటీవల కురిసిన వర్షాలకు జలమయమైన లోతట్టు ప్రాంతాలను మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహప్రసాద్ పరిశీలించారు. శుక్రవారం తేనెబండ వీరభద్ర కాలనీ సంతపేట ప్రతిభ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనంలో ఆయన పర్యటించారు. ప్రజలకు ప్రత్యామ్నాయ చర్యలు కల్పించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో జరుగుతున్న రోడ్ల విస్తరణ పనుల్లో భాగంగా ఈనెల 18వ తేదీన పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ సంతపేట అసిస్టెంట్ ఇంజినీర్ చిరంజీవి వెల్లడించారు. ఈమేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలోని సంతపేట సెక్షన్‌లోని 11 కేవీ, ఎల్‌టీ విద్యుత్ లేన్లు రోడ్లు విస్తరణతో మారుస్తున్నారన్నారు. దీంతో శనివారం నగరంలోని తోట పాళ్యం, గాంధీరోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా దేవానంద్



యాదమరి: ఏపీటీఎఫ్ యాద మరి మండల అధ్యక్షుడిగా రేగంటి దేవానంద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవా రం కొటాలం ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర అదనపు కార్యదర్శి చెంగల్రాయ మందడి ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. సంఘం ప్ర ధాన కార్యదర్శిగా త్యాగరాజురెడ్డి, అదనపు కార్యదర్శిగా హేమలత, సహాధ్యక్షులుగా కళైవాణితోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి గిరిబాబు యాదవ్ అధ్యక్షత వహించారు.

దౌర్జన్యంపై కేసు నమోదు చేయాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): డీఎస్పీ హోదాలో పని చేస్తున్న ఎస్సీ కులానికి చెందిన అధికారిపై జరిగిన దౌర్జన్యంపై పోలీసు ఉన్నతాధికారులు కేసు నమోదు చేయకపోవడం శోచనీయమని దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్ విమర్శించారు. శుక్రవారం చిత్తూరు ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. కార్వేటినగరం కత్తిరిపల్లెకు చెందిన డీఎస్పీ జనార్ధన్‌రావు ఆ గ్రామంలో కొనుగోలు చేసిన భూమిలోకి వెళ్లనీయకుండా ఆ గ్రామంలోని అగ్రకులస్తులు దౌర్జన్యం చేస్తున్నారని, దీనిపై ఆయన నగరిలో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదన్నారు. ఎస్పీ స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



మద్యం షాపులో తనిఖీలు చేస్తున్న డీసీ

యాదమరి: గ్రామాలలో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ విజయ్‌శేఖర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన యాదమరిలోని మద్యం షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ, మద్యం విధానంపై ప్రభుత్వం పారదర్శకంగా వ్యహరిస్తోందని పేర్కొన్నారు. ఎవరైనా సామాజిక మాధ్యమాలలో మద్యంపై అసత్య ప్రచారాలు చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం సురక్ష యాప్‌పై సిబ్బంది, వినియోగదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎక్సైజ్ ఎస్సైలు రమణరాజు, చరణ్‌తేజ, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాలతో ఉన్నత అవకాశాలు



సర్టిఫికెట్‌లు అందుకున్న విజేత విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : క్రీడా నైపుణ్యాలతో ఉన్నత అవకాశాలు పొందవచ్చని జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి బాలాజీ తెలిపారు. ఈ మేరకు చిత్తూరులోని క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో శుక్రవారం జీఎస్టీ 2.0 పై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లు, మెడల్స్ అందజేశారు. వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ రాజగోపాల్, జిల్లా పర్యాటక శాఖ అధికారి నరేంద్ర, మైభారత్ జిల్లా యువజన అధికారి ప్రదీప్ పాల్గొన్నారు.